# రా'మాయన్'

"గ్రగర్ రామాయణం" చిత్ర నిర్మాణ చివరి దశ మహా జోరుగా సాగుతోంది. సాగుతోంది మరి....!

ఎర్రమేఘ శ్యాముడైన రాముడు, పీలగొంతు రావణుడు, పైకొకడు, క్రిందికొకడు వీరవిహారంగా బాణాలేసుకుంటున్నారు.

ఆ బాణాలు తమ కెక్కడ తగుల్తాయోనని "టెక్నీషియన్స్" "బోయిస్" నానా అవస్థ పడుతున్నారు. కెమెరావైపు గానీ, డైరక్టరు వైపు గానీ పొరపాటునైనా సరే బాణం ప్రయాణం చేస్తే తాము హాస్పిటల్‌కి ప్రయాణం చెయ్యాల్సి వుంటుందని రామరావణులిద్దరికీ తెలుసు. డైరక్టర్ మాయానంద్‌గారు అతి డిసిప్లినేరియన్!

ఈ సీన్‌లోనే రాముడు బ్రహ్మాండం బద్దలయ్యేటట్టు బాణం వెయ్యాలి. రావణుడి కడుపులోని అమృతభాండం బద్దలవ్వాలి. భాండం బద్ధలై అమృతం కడుపులో ఒలికినా సరే రావణుడు మరణిస్తాడు. ఆ ట్రిక్ ఫోటోగ్రఫీ ఆ చిత్రీకరణ అదంతా వేరే నిర్మాణం....కట్!

వేరే షాట్ మొదలైంది.

'రామా' అంటూ రావణాసురుడు ఆనందంగా నేలపడ్డాడు.

రాముడు ఎందుకో చాలా బాధపడ్డాడు.

నేలబడ్డ రావణుడు, రాముణ్ణి దగ్గరగా రమ్మని సైగచేసి పిలిచాడు. దగ్గరికెళ్తే చటుక్కున చురకత్తెట్టి పొడుస్తాడేమోనని జాగ్రత్తగా వెళ్ళాడు రాముడు. చిద్విలాసంగా నవ్వుతూ నుంచున్నాడు.

రావణాసురుడు పెద్ద, "స్పీచ్" మొదలుపెట్టాడు.

"రామా! నువ్వు విష్ణువువని, సీత లక్ష్మి అనీ నాకు తెలుసు. మరో విషయం చెప్తాను. ఆశ్చర్యపోకు. నేను ఎత్తుకొచ్చిన సీత, ఛాయాసీత అన్న విషయం కూడా నాకు తెలుసు. అసలు సీతని ఎత్తుకునే రాపోదును. ఆ మహాపతివ్రతని తాకితే నేను భస్మమైపోనూ! అందుకనే ఈ ఛాయా సీత నెత్తుకొచ్చాను. ఈమె అయినా నన్ను వలచి వరించకపోతుందా అనుకున్నాను. ఈమె అసలు సీతకన్నా వందరెట్లెక్కువ శోకిస్తూ అశోకవనంలో కూర్చుంది. నాఖర్మ, ఈ ఛాయా సీత కోసం నువ్వెందుకంత ఏడ్చావో నాకర్థం కాలేదు. నీ సీతని నువ్వు అగ్నిలోంచి తిరిగి తీసుకుని నీ దారిన నువ్వు పోవచ్చు కదా? ఏది ఏమైనా నువ్వు గొప్ప నటుడివిలే! అంత గొప్ప నటుడివి. ఇంత దూరం అరణ్యం ఎందుకొచ్చావో అసలు అర్థం కావడం లేదు. అరణ్యానికి వచ్చినట్టు నటించకపోయావా? అవ్వన్నీ నాకెందుకు? కొద్దిసేపట్లో చావబోతున్న వాడికి? ఇంత తులసి తీర్థం పొయ్యి నా గొంతులో. నా కొడుకులందర్నీ చంపించావు. నా ప్రియతమ తమ్ముడు కుంభకర్ణున్ని చంపావు. విభీషణుణ్ణి తులసి తీర్థం పొయ్యరా అని అడగడానికి నాకు మొహం చెల్లడం లేదు. ఆ పుణ్యం నువ్వే కట్టుకో" అని ప్రాధేయపడ్డాడు.

రాముడు చిరునవ్వు నవ్వుతూ ఆగ్నేయాస్త్రం సంధించాడు. భూమి చిల్లుపడింది. తులసి గంగ ఆకాశానికి ఎగజిమ్మింది. ఒకప్పుడు కడుపు చీల్చి పేగుల్తో రుద్రవీణ వాయించిన రావణాసురుడు రాముడి బాణంతో కడుపు పగిలి కడుపు నిండా తులసి నీళ్ళు త్రాగి చివరి వాయువు వదిలాడు.

అగ్ని, భూమి, గంగ, ఆకాశం, వాయువు పంచభూతాలు రామ కథని ఆనందంగా గానం చెయ్యసాగాయి.

ఆ రాత్రి కడుపు పగిలేట్టు తిని తాగిన రామ, రావణ పాత్రధారులతో డైరక్టర్ మాయానంద్ ఇలా శలవిచ్చాడు.

"ఓరి చెవులో పువ్వులూ! వాల్మీకి ఏం రాశాడన్నది ఎవరికీ తెలీదు. అయినా వాల్మీకి రాసినట్టు తీశామనుకో. మనకసలు రామాయణం తెలీదనుకుంటాడు ప్రజానీకం.

అదీగాక ప్రపంచంలో మూడు వందల ప్రసిద్ధమైన రామాయాణాలున్నాయి. అవి గాక ప్రతి భాషలో మరో మూడు మూడువందల రామాయణాలున్నాయి. ఎవరికి తోచిన కల్పనలు వాళ్ళు చేసేశారు. మనం అన్నీ కలిపి మసాలా చేసేశాం అనుకో. మన రామాయణం సూపర్‌హిట్! మరో విషయం! ఇంగ్లీషు సినిమాలో ఓ ముద్దూ, గుద్దూ ఎంత కామనో, మన సినిమాలో ఓ రేపూ, ఓ దూపూ, ఓ సెంటిమెంటూ అంత కామన్! అది ప్రేమాయణమైనా సరే, రామాయణమైనా సరే! ఇదే ఫార్ములా! జాగ్రత్త!!

పూలు పుయ్యని మేడిచెట్టు సరాసరి కాయలు కాసేసి, పండిపోయింది.